ఖాతాదారుల నగదుకు భద్రత కల్పించాలి

ఎమ్మెల్యే బెందాళం అశోక్

విశాలాంధ్ర-కవిటీ: బ్యాంకుల్లో ఖాతాదారులు జమ చేసిన నగదుకు భద్రత కల్పించాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ కవిటి ఎస్ బి ఐ మేనేజర్ అశోక్ చక్రవర్తికి సూచించారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలోని ఎస్బిఐ కార్యాలయంలో ఎస్బిఐ మేనేజర్ అశోక్ చక్రవర్తికి కలిశారు. ఖాతాదారులు వివిధ అవసరాల కోసం భద్రత కోసం బ్యాంకులో నగదు పొదుపు చేసుకుంటే ఈ మధ్యకాలంలో ఖాతా దారుల ఖాతాల నుండి ఎక్కువ మొత్తంలో నగదు ఖాతాదారునికి తెలియకుండా నగదు మాయమవు తుందని ఖాతాదారుడు అవసరాల కోసం బ్యాంకుకు నగదు తీసేందుకు వెళితే నగదులేని విషయం ఖాతాదారులకు తెలుస్తుందని బ్యాంక్ మేనేజర్‌కు ఎమ్మెల్యే అశోక్ వివరించారు. ఈ సమస్యకు తక్షణమే ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కా రం చూపాలని బ్యాంక్ మేనేజర్‌కు సూచించారు. తాను కూడా ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తానని బ్యాంక్ మేనేజర్ అశోక చక్రవర్తికి ఎమ్మెల్యే అశోక్ తెలిపారు. ఇప్పటి వరకు ఖాతాదారుల ఖాతాలో పోయిన నగదు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

మహిళా సంఘాలు సూత్రాలు పాటించాలి : ఏపీఎం

విశాలాంధ్ర-ఆమదాలవలస : మహిళా స్వయం శక్తి సంఘాలన్నీ విధిగా పంచ సూత్రాలు పాటించాలని, అవి పాటించిన నాడే మహిళలు స్వయం సమృద్ధి సాధించగలుగుతారని, వైయస్సార్ క్రాంతిపదం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. రామచంద్రాపురం పంచాయతీ పొన్నంపేట గ్రామంలో రామాలయం దగ్గర ఏర్పాటుచేసిన గ్రామ సంఘం సమావేశంనకు హాజరైన స్వయం శక్తి సంఘాల లీడర్ల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి స్వయం శక్తి సంఘం నెలవారి సమావేశాలు జరిపించు కుని సమావేశంలోనే పొదుపు, అప్పులు ఆర్థిక లావాదేవీలను అందరి సమక్షంలో జరగాలని సూచించారు. జరిగిన ప్రతి అంశాన్ని సంఘ సభ్యులు తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని తీర్మానం పుస్తకంలో వెంటనే రాపించుకొని తెలిపారు. సభ్యురాలు తీసుకున్న ప్రతి అప్పును ఒక రూపాయి వడ్డీతో తిరిగి సంఘానికి రీపేమెంట్ అయ్యేటట్లు చూడాల్సిన బాధ్యత సంఘ సభ్యులు అందరూ పైన ఉన్నట్లు వివరించారు. ఈకార్యక్రమాలన్నీ సక్రమంగా జరిగేటట్లు బాధ్యత తీసుకోవాలని గ్రామ సంఘం పాలకవర్గ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వి.వో.ఏ. గాయత్రి, గ్రామ సంఘం ప్రతినిధులు, స్వయం శక్తి సంఘాల లీడర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీవో ఫణీంద్రకుమార్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: మండల వ్యాప్తంగా ఉన్న ఉపాధి హామీ పథకం కూలీలందరికీ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.ఫణీంద్రకుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఉపాధిహామీ కార్యాల యంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావే శం నిర్వహించారు. మండలాల్లోని వెలుగు ఏపీ సమన్వయం చేసుకొని ఉపాధి హామీ పథకం సిబ్బంది ఉపాధి హామీ కూలీలకు ఈ పథకంలో చేర్పించాలన్నారు. 18 నుండి 50 సంవత్సరాల మధ్య ఉన్నవారు ఈపథకానికి అర్హులని, ప్రమాద వశాత్తు లబ్ధిదారులు మరణిస్తే రూ. 2 లక్షలు, అంగవైకల్యం సంభవిస్తే రూ.1 లక్ష పరిహారంగా బీమా సంస్థ చెల్లిస్తుందన్నారు. ఇందుకుగాను ప్రతి కూలి ఏడాదికి రూ.20 చొప్పున ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామస్థాయిలో వెలుగు ఫ్లెస్టర్ ఫెసిలి టేటర్లు ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో ఈపథకంలో కూలీలను భాగస్వా ములను చేయాలన్నారు. 100శాతం కూలీలను ఈ పథకంలో చేర్పించా ల్సిందని సిబ్బందికి లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈకార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ జి.హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు భీమా సౌకర్యం : డ్వామా పిడి

విశాలాంధ్ర-గార: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఇకపై ప్రధానమంత్రి బీమా సురక్ష యోజన పథకాన్ని గుర్తింపు చేయనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవి చిట్టి రాజు కూలీలకు తెలియజేశారు. బుధవారం గార మండలం శ్రీకూర్మం పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా ఆహార భద్రతతో పాటు జీవన భద్రతను గూడా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని స్పష్టం చేశారు. ఉపాధి పథకంలో కూలీలకు అగ్ర ప్రాధాన్యతను ఇస్తున్నామని, వారే ఈ పథకానికి జవం, జీవం అని ఆయన అన్నారు. ప్రతి కూలి 100 రోజుల ఉపాధి హక్కును సద్వినియోగం చేసుకోవాలని, రూ. 257 గరిష్ట వేతనం పొందేందుకుగాను కనీసం రోజుకు ఆరు గంటలపాటు పని ప్రదేశంలో పని చేయాలని సూచించారు. పనులు నాణ్యతతో చేసినట్లయితే వాటి ఫలితాలు మీ గ్రామానికి లభిస్తాయని, తద్వారా నీటి నిల్వ సామర్థ్యం చెరువుల్లో పెరగడం ద్వారా పంట దిగుబడి పెరిగి నాణ్యమైన పంటలు చేతికి అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వేతనదారులకు అవసరమైన సాంకేతిక సలహాలను ఎప్పటికప్పుడు అందజేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిడి వెంట ఏపీవో సంధ్యారాణి, జేఈ నారం నాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ నాయుడు, రామచంద్రరావు, ఇతర ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

దూషించడం మానుకొని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

దువ్వాడకు కిరణ్ హితువు

విశాలాంధ్ర-టెక్కలి : అసభ్య పదజాలంతో దూషించడం ఇకనైనా మానుకొని ప్రజా సమస్యలపై దృష్టి పెడితే రాజకీయ భవిష్యత్ వుంటుందని వైసీపీ నాయకులు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ టెక్కలి జనసేన పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ కణితి కిరణ్ కుమార్ హితువు పలికారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో అయన మాట్లాడుతూ దువ్వాడ శ్రీనివాస్ నీచ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అని దుయ్యబట్టారు. ప్రజారాజ్యం పార్టీ లో వున్నప్పుడు ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చినప్పుడు గెలవ లేకపోయరని మళ్ళీ వచ్చిన బై ఎలక్షన్ లో ఓట్లను అమ్ముకున్న నీచ చరిత్ర శ్రీనివాస్ ది అని అన్నారు. అదేవిదంగా దువ్వాడ పవన్ కళ్యాణ్ ను అసభ్య పదజాలంతో దూషించడం ఇకనైనా మానుకోవాలన్నారు. పవన్ కళ్యాణ్ సభ పెడితే వైసిపి నాయకులు భయపడుతున్నారు అని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సభలు పెడుతుంటే మేము ఎప్పుడైనా ఒక మాట అయినా అన్నామా అని ప్రశ్నించారు. జనసేన పార్టీ విధానాలు, విధులు మా ఇష్టమని వీటి గురించి ప్రశ్నించే హరత వైసీపీకి ఎక్కడ ఉందన్నారు. మేము ఎవరితో కలిసి పోటీ చేస్తే వీరికి ఎందుకని, దమ్ముంటే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి గానీ తప్పుడు కూతలు కూయడం సబబు కాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ నాయకులు అట్టాడ శ్రీధర్, మెట్ట అవినాష్, గొనప చందు, ఇలపండ రమేష్, కొత్తూరు హరి, గురయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ ధృవ పత్రాలను అందజేయండి : సబ్ కలెక్టర్

విశాలాంధ్ర-మెళియాపుట్టి : మెళియాపుట్టి మండల పరిధిలో గల మాలడికోట గ్రామంలో ఇనాం భూముల ప్రక్రియలో మీ దగ్గరన్న భూము లకు సంబంధించిన ధ్రువపత్రాలు అందజేసినట్లైతే వాటిని పరిశీలించి న్యాయం చేస్తామని టెక్కలి డివిజన్ సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేసిన ఆయన కొత్త మారెడుకోట గ్రామంలో గల రైతులు, ఇనాం భూముల యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమకు తామే హక్కుదారులమంటూ ఇరువర్గాల తెలియజేస్తుండటంతో అసలు ఆ భూములకు సంబంధించిన ధృవపత్రాలు రెవెన్యూ వారికి అందజేస్తే వాటిని పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయడానికి కృషి చేస్తామని అనేక అంశాలపై అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ రాహుల్ కుమారురెడ్డితో పాటు తహశీల్దారు సరోజిని, ఆర్ఐ వైకుంఠరావు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శి ఢిల్లీ, సర్పంచ్ పెద్దింటి భాగ్యం, శ్రీనివాసరావు, శ్రీనివాసు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ రాధిక

విశాలాంధ్ర-టెక్కలి : పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ పరీక్ష కేంద్రాలను ఎస్పి రాధిక బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెక్కలి లోని 14 సెంటర్లలో ఈ నెల 22న పరీక్షలు నిర్వహించబడునని ఈ పరీక్ష కేంద్రాల్లోని మౌలిక సదుపాయాలను ఎస్పి రాధిక దగ్గరుండి పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి :మండలంలోగల నారాయణ పురం గ్రామ సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాధంలో అదే గ్రామానికి చెందిన ఉర్జాన సింహాచలం (55) మృతిచెందాడు. సింహాచలం సైకిల్‌పై వెలుతుండగా కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. సంఘటనలో సింహాచలం అక్కడకక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య రమణమ్మ, ఒక కుమార్తె ఉన్నారు. వీరంతా వ్యవసాయ కూలీపని చేసుకొని జీవనం సాగిస్తున్నారు. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవటంతో కుటుంబం వీదులో పడిందని పలువురు బంధువులు వాపోతున్నారు. ఈ మేరకు స్థానిక హెడ్ కానిస్టేబుల్ విశ్వేశ్వరరావు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రుద్రరాజుకు, సింహాద్రినాయుడు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-రణస్థలం : ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పుట్టినరోజు సంధ్బంగా ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కొత్తకోట్ల సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో రణస్థలం పార్టీ కార్యాలయం లో కేక్ కట్‌చేసి గిడుగు రుద్రరాజుకి పుట్టినరోజు శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మీ, యండ సూర్యనారాయణ, కె.జోగినాయుడు, ఎ.జగదీష్ నాయుడు, ఎం.గణేష్, ఎం.రమణ, పి.గోవింద్, ఎల్.చిన్న, ఎల్.గౌరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షిస్తాం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : హిందు ధర్మాన్ని పరిరక్షిద్దామని స్థానిక వేదపండితులు, దేవి ఉపాసకులు బ్రహ్మశ్రీ సుసరాపు చంద్రశేఖరశర్మ అన్నారు. బుధవారం స్థానిక శివకేశవ పంచాయతన కళ్యాణ మండపంలో బాగవతుల గౌరిశంకరశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మణ కులానికి చెందిన ఆయన శిష్యులు, బంధువులు ఆయనకు సువర్ణ సంహా తలాట సన్మానసభ నిర్వహించి కంకణం తోడిగారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సమాజంలో కొంతమంది అన్యామతస్తులు హిందు ధర్మాన్ని మంటగలిపే ప్రయత్నం చేస్తూ, గ్రామాల్లో మతమార్పిడిలకు ప్రయతిష్తుంచే కార్యక్రమాలు చేపడుతున్నారని, ఈ నేపద్యంలో హిందు ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో నరసన్నపేట, పోలాకి, టెక్కలి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన బ్రహ్మణ కులస్థులు పెద్దఎత్తున హాజరయ్యారు.

అగ్నిప్రమాదంలో ట్రాక్టర్‌తోపాటు వరికుప్పలు దగ్ధం

విశాలాంధ్ర-మందస : మండలం దేవుపురం గ్రామంలో వరి నూర్పిడి ట్రాక్టర్ నుంచి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో సుమారు 5 ఎకరాల వరికుప్పలు దగ్ధమయ్యాయి. దేవుపురం గ్రామానికి చెందిన గేదెల మహాలక్ష్మి, దుర్యోధన, హరిక్రిష్ణ అనే రైతులకు చెందిన 5 ఎకరాల వరికుప్పలను ట్రాక్టర్‌తో నూర్పిడి చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ట్రాక్టర్‌తోపాటు వరికుప్పలు దగ్ధమయ్యా యని బాధితులు తెలిపారు. సంఘటన స్థలానికి మందస అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. చేతికి అందివచ్చే పంట అగ్నికి ఆహుతి అవ్వడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయాన్ని విజ్ఞాన కేంద్రంగా తయారుచేయాలి

విశాలాంధ్ర-పలాస : గ్రంథాలయాన్ని విజ్ఞాన కేంద్రంగా తయారు చేయాలని యువివి గౌరవ సలహాదారులు, హైదరాబాద్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దున్న రామక్రిష్ణ అన్నారు. బుధవారం ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం తన చిన్ననాటి స్నేహితులతో ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా దున్న రామక్రిష్ణకు, జుత్తు పురుషోత్తం, మల్లేన జీవనరావు లకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇసాకోటి జోగారావు, బొడ్డు చిన్నారావు, ఓంకార్, రెయ్యి క్రిష్ణారావు, కుత్తుం ప్రకాశరావు, తెప్పల వాసుదేవరావులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎంపీపీ పరామర్శ

విశాలాంధ్ర-కంచిలి : మండలంలో పలువురు వైసిపి సానుభూతిపరులు ఇటీవల మృతి చెందడంతో స్థానిక ఎంపీపీ దేవదాస్ రెడ్డి, నాయకులతో కలిసి బుధవారం పరామర్శించారు. %జీ% శాసనం కి చెందిన వైస్ సర్పంచ్ కుమారస్వామి మేనల్లుడు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే బూరగాం గ్రామానికి చెందిన కిమోజు మనమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తో పాటు మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, పిఎస్సిఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, నాయకులు వెంకట్రావు, కృష్ణారావు, మాధవరావు, భీమారావు, చిన్నారావు, మన్మధరావు, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ 27వ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-కవిటీలో : మాజీ ముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు నంద మూరి తారక రామారావు 27వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన కవిటి మూడు రోడ్ల కూడలి లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహంకు స్థానిక ఎమ్మెల్యే బెందాలం అశోక్, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ ఒక గొప్ప నటుడు, ప్రజానాయకుడు నందమూరి తారక రామారావు అని అన్నారు. 1982 మార్చి 29వ తేదీన తెలుగుదేశం పార్టీ పేరుతో రాజకీయ పార్టీ స్థాపించి రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఘనత ఎన్టీఆర్‌ది అన్నారు. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారాన్ని చేజిక్కించుకొన్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పేద బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసిలు పొందల కృష్ణారావు,బి రమేష్, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ సిపాన వెంకటరమణ, మండల తెదేపా అధ్యక్షులు మని చంద్రపకాష్, మండల టీడీపీ నాయకులు, బాసుదేవ్ రౌలో, భీమ రౌలో, బార్ల చిన్నబాబు, మణిబాబు, బి.తిరుమలరావు, రఘు పాత్రని శ్రీనివాస రావు, భావన నారాయణమూర్తి, భావన సీతారామమూర్తి నాయుడు, తమరాల హరనాద్, బావన కామేష్, పూడి ప్రవీణ్, పి.సంతోష్, కోరాడ లక్ష్మి,ఆర్.భాగ్యం తదితరులు పాల్గొన్నారు.

పలాసలో : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థా పకులు నందమూరి తారక రామారావు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఆయన బాటలో నడవాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషా అన్నారు. బుధవారం పలాస టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి, అలాగే కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలోగల ఎన్టీఆర్ విగ్రహాలకు నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్నచౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగువాడి ఆత్మగౌరవాన్ని కాపాడిన ఆ మహానేత బాటలో ఆయన ఆశయ సాధన కోసం నడవాలని అన్నారు.

రణస్థలంలో : టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి, ఎచ్చెర్ల నియోజక వర్గ ఇన్‌చార్జ్ కిమిడి కళావెంకట రావు ఆదేశాల మేరకు బుధ వారం రణస్థలం హెడ్ క్వార్టర్స్ జె ఆర్ పురంలో మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కోష్ట మాజీ సర్పంచ్ పిషిణి జగన్నాధం ఆద్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల యువ నాయకులు పిషిణి హరి, మండల నాయకులు, కార్యకర్తలు పార్టీ అభిమా నులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో : పేదల పెన్నిది, తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు, దివగంత ముఖ్యమంత్రి, ప్రముఖ సినీనటుడు నందమూరి తారక రామారావు ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని, తెలుగు వారి ఖ్యాతిని ఖండాంత రాల్లో చాటి చెప్పిన మహనీయుడని, ఆయన ఆశయ సాదనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు అన్నారు. బుధవారం ఎన్‌టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా స్థానిక పాతబస్‌స్టాండ్ అవరణంలో నిర్మించిన పార్కులో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి, మండల పరిషత్ అవరణలో మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ ఆద్వర్యంలో ఎన్‌టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కీర్తికి 9 నెలల్లో ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్‌టీఆర్ యని, ముఖ్యమంత్రిగా నిరుపేదల అభ్యున్నతికి ఆయన ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ టెక్కలి నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు పూజారి శైలజ, మాజీ ఏఎంసీ చైర్మన్ వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, మండల మాజీ ఉపాధ్యక్షుడు కల్లి నాగయ్యరెడ్డి, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు లక్ష్మణరావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు కోరాడ గోవిందరావు, కల్లి లక్ష్మణరెడ్డి, పట్ట సింహాచలం, జెడ్‌పీటీసీ ప్రతినిధి నంబాళ్ళ శ్రీనివాసరావు, మాజీ రాష్ట్ర జలవలసరుల సంఘ డైరెక్టర్ కర్రి అప్పారావు, లాడి శ్రీనివాస్, పార్టీ నాయకులు, సాసుమంతు ఆనందరావు, హనుమంతు అప్పలరాజు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో : పారిశ్రామికవాడలో టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రక్త దాన శిబిరం కార్యక్రమం తెలుగు యువత శ్రేణులు నిర్వహించారు. బుధవారం బ్లడ్ డొనేషన్ క్యాంప్ జరిగింది. జిల్లా టిడిపి అధ్యక్షులు కూన రవికుమార్ అధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. టీడీపీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు రక్తదానంలో పాల్గొన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తం సరఫరా చేసేందుకు ఇటువంటి సామాజిక సేవా కార్య క్రమాలు ఉపయోగపడ తాయని మాజీ టీడీపీ విప్ కూన రవికుమార్ అన్నారు. బ్లడ్ దోనార్లను అభినందించారు. కార్యక్రమంలో ఆముదాలవలస నియోజకవర్గ టిడిపి నాయకులు సనపల ఢిల్లీ శ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూకరాజు, ఆనెపు రామకృష్ణ, తమ్మినేని గీతా విద్యాసాగర్ ఎస్ సూర్యం ఎ.రాము సిహెచ్ రామ్మోహనరావు, గొండు రమణమూర్తి, భాస్కరరావు, గౌరీపతి ఎంపీటీసీలు, సర్పంచులతోపాటు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : ఎన్టీఆర్ స్థాపించిన టిడిపిలో పని చేయడం పూర్వజన్మ సుకృత మని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని ఎస్ ఎం పురం గ్రామంలో జిల్లా టిడిపి మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి స్వగృహం వద్ద బుధవారం టిడిపి వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచిన పార్టీ టిడిపి అని చెప్పారు.

ఎన్టీఆర్ ఆశయాలను, సిద్ధాంతాలను పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకు వెళ్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు కార్య కర్తలంతా పనిచేయాల న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, జడ్పీ మాజీ చైర్ పర్సన్ చౌదరి ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ చౌదరి అవినాష్, మాజీ ఎంపీటీసీలు గొంటి నరసింగరావు, గూరు జగపతిబాబు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆవిర్భావంతోనే ప్రజల్లో చైతన్యం వచ్చిందని పార్టీ వ్యవస్థాపకులు ఎన్టి రామారావు సంక్షేమ పథకాలను తీసుకురావడం తో పాటు సంస్కరణలను చేపట్టారని టిడిపి ,పొలిట్ బ్యూరో సభ్యుడు మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు అన్నారు. చిలకపాలెంలోని ఓ కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టిడిపి రాక మునుపు ఎమ్మెల్యేలు ఐదేళ్లకోసారి మాత్రం ప్రజలకు కనిపించే వారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఉద్యోగాల్లో మూడో వంతు మహిళలకు కేటాయించారన్నారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కిందన్నారు. టిడిపి కార్యకర్తలు పార్టీ అన్నారు. కార్యకర్తల బుజస్కందాలపైనే ఈ పార్టీ నడుస్తుందని చెప్పారు. రాష్ట్రంలో అన్ని వర్గాలపై దాడులు పెరిగాయి అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం తధ్యమన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 100 మంది రక్తదానం చేశారు. పేద మహిళలకు బట్టలను పంపిణీ చేశారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక నాయుడు 4 మండలాల టిడిపి అధ్యక్షులు బెందు మల్లేశ్వర రావు, ముప్పిడి సురేష్, లంక గాంధీ, కొమరాపు రవి, మాజీ జడ్పిటిసి గొర్లే లక్ష్మణరావు మాజీ ఎంపీపీ డీజీఎం ఆనందరావు, పార్టీ నేతలు అన్నెపు భువనేశ్వర్రావు, వావిలపల్లి రామకృష్ణ, గాలి వెంకటరెడ్డి, అల్లుపల్లి రాంబాబు, బోర శ్రీనివాసరావు, గూరు జగపతిబాబు, బళ్లాడ అరుణ మెండ రాజారావు మూకళ్ల భాస్కరరావు, గట్టెం శివరాం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ళ నిర్మాణానికి కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలి

- పేదల ఇళ్ళ సమస్యల పరిష్కారానికి పోరుబాట
- సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి

విశాలాంధ్ర-శ్రీకాకుళం : రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కొలనీల పేరుతో పేద ల ఇళ్ళ నిర్మాణం కి ఇస్తున్న రూ. 1.80 లక్షలు కనీసం పై కప్పు వేసేందుకు కూడా సరిపోవు అని, ఆ ఇళ్ళ నిర్మాణ లబ్ధిదారులకు ఇసుక, సిమెంట్ ఉచితంగా ఇచ్చి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ పార్టీ నిర్వహిస్తున్న పోరుబాట కార్యక్రమ గోడ పత్రిక ను బుధవారం స్థానిక ఎస్ ఆర్ దాసరి క్రాంతి భవన్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల లో ఇళ్ళ నిర్మాణం కోసం పేదలకు ఇస్తున్న స్థలం సరిపోదు అని పట్టణాల్లో 2 సెంట్లు, పల్లెల్లో 3 సెంట్లు ఇవ్వాలని కోరినా ఇవ్వకుండా పట్టణాల్లో ఒక సెంటు, పల్లెల్లో 1.5 సెంట్లు ఇవ్వటం సరికాదు అన్నారు. ఆ నిర్మాణంకి ఇస్తున్న డబ్బులు కూడా సరిపోవు అని కనీసం రూ. 5 లక్షలు ఇవ్వాలన్నారు. టిడ్కో గృహాలను కూడా వెంటనే లబ్ధి దారులకు అందించాలి అని, ఆ గృహ సముదాయాలు, జగనన్న కాలనీ లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ తదితర డిమాండ్ లతో పోరు బాట కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 30 వరకు లబ్ధిదారులను కలిసి సంతకాలు సేకరించి 30వ తేదీన మండల తహసీల్దార్‌కు వినతి పత్రాలు ఇస్తామన్నారు. ఫిబ్రవరి 6 కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని, అప్పటికీ ప్రభుత్వం దిగిరాకుంటే ఫిబ్రవరి 22 విజయవాడలో లబ్ధిదారులతో కలిసి మహా ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. పేదల కు కూడు, గూడు, గుడ్డ కల్పించటం సీపీఐ ధ్యేయం అని, పేదల పక్షాన సీపీఐ నిరంతరం పోరాడుతుంది అని తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు చిక్కాల గోవిందరావు, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు పట్టా ప్రభావతి, పొందూరు మండల కార్యదర్శి రాంబిల్లి సత్యన్నారాయణ, పాత్రునివలస గ్రామ శాఖా కార్యదర్శి బలగ రామారావు, రైతు సంఘం నాయకులు అప్పారావు, గార మండల శాఖ కార్యదర్శి రామకృష్ణ, మహిళా సంఘ నాయకురాలు నీలవేణి, రంగారావు, ప్రసాద్, సాంబమూర్తి తదితరులు ఉన్నారు.

ఫోన్స్, టీవీల్లేని ఓ ఊరు

విశాలాంధ్ర-జలుమూరు : 'మన సిక్కోలు జిల్లాలో ఫోన్స్, టీవీల్లేని రింగ్టన్స్ వినిపించని.. టీవీలు కనిపించని.. కరెంట్ కూడా లేని ఓ ఊరు శ్రీకాకుళం జిల్లాలో ఉందని తెలుసా..? అదే హీరమండలం మండలంలోని 'కూర్మ'. ఇక్కడి ప్రజలు ఆధునికతకు దూరంగా, సనాతన ధర్మమే వేదంగా బతుకుతున్నారు. నేటికీ ప్రాచీన వృత్తులే కనిపిస్తాయి. 12 కుటుంబాలు, 16 మంది విద్యార్థులు, ఆరుగురు బ్రహ్మచారులతో కలిపి మొత్తం 56 మంది ఉంటున్నారు. ఈ ప్రదేశం నచ్చి రష్యా నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఇక్కడే ఉండిపోవడం విశేషం.

సాయం చేసినప్పుడే సంతృప్తి

రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: శ్రీకాకుళం రోటరీ క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు సైకిల్, మహిళలకు టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలాకాలంగా జిల్లాలో అనేక మందికి ప్రయోజనం కలిగించే విధంగా ఈ సంస్థ పనిచేస్తోందని కితాబిచ్చారు. మనం ఇతరులకు సహాయపడినప్పుడే సంతృప్తి కలుగుతుందన్నారు. సమాజ సేవ చేయాలి అనుకునే వారికి, నమ్మకమైన సేవే పరమావధిగా పనిచేస్తున్న సంస్థ, అందరి విశ్వాసం చూరగొన్న సంస్థ శ్రీకాకుళం రోటరీ క్లబ్ అని ప్రశంసించారు. వైఎస్సార్ కాంగ్రెస్ హయాంలో నడుస్తున్న ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. పెద్దాస్పత్రి పెద్ద ఎత్తున నిధులు కేటాయించామని, అదేవిధంగా పొట్టి శ్రీరాములు మార్కెట్‌ని అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో 900 పడకలు అందుబాటులోకి తీసుకువచ్చామని, మార్కెట్‌కు సంబంధించి కోటి రూపాయలతో రహదారులు వేశామని అన్నారు. నగరానికి 4 అర్బన్ హెల్త్ సెంటర్స్ మంజూరు చేశామని, అందులో రెండు ప్రారంభించామని వెల్లడించారు. భవిష్యత్‌లో నగర ప్రజలకు 24 గంటలూ నీరందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. ప్రతి డివిజన్‌కూ శానిటైజేషన్ కు సంబంధించి ఒక సెక్రటరీని ఉంచామని చెప్పారు. నేను ఇక్కడకి రాకముందు గార్బేజి పెద్ద సమ్యగా ఉండేదని, కంపోస్ట్ కాలనీలో కొన్ని సంవత్సరాలు, ఆ తర్వాత పాలకొండ రోడ్‌లో వేసే వాళ్ళు, ఆ తర్వాత 27 ఎకరాల్లో తండెంవలసలో ఏర్పాటు చేశామని ఇప్పుడు అది నిండుకుందన్నారు. రూ.18 కోట్లతో ఆ చెత్త నుంచి సంపద తయారు చేసే ప్రక్రియ మొదలు పెట్టామని, సుమారు 6 నెలలలో మొత్తం చెత్తను రీసైక్లింగ్ చేయించనున్నామన్నారు. గూనపాలెం నుంచి రోటరీ క్లబ్‌కు వెళ్లే దారి బాగుండక పోవడంతో సీసీ రోడ్డు వేయాలని సంస్థ ప్రతినిధులు అభ్యర్థించగా, మంత్రి ధర్మాన వెనువెంటనే స్పందించి మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేశుతో మాట్లాడి నెల రోజుల్లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు మంత్రి ధర్మానకు క్లబ్ ప్రతినిధులు కృతజ్ఞతల తెలిపారు. వీరి వెంట కింతలి నాగేశ్వరరావు, జే. వెంకటేశ్వరరావు, డాక్టర్ సోమేశ్వరరావు, రెడ్ క్రాస్ చైర్మన్ జగన్నాథ్ రావు, శంకర్ నారాయణ, డాక్టర్ సుధీర్, కెప్టెన్ జగదీశ్, కొంక్యాన మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్లు ఇన్‌చార్జులుగా నాగభూషణరావు, భాస్కరరెడ్డిలు నియామకం

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మండలంలోగల సచివాలయాల కన్వీనర్లు ఇన్‌చార్జీగా మండలం వాసాహెబ్‌పేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గద్దవలస నాగభూషణ రావును నియమిస్తూ రిజనల్ కో-ఆర్టినేటర్ హర్షవర్ధన్ బుధవారం వీటికి సంబందించిన ఎన్నిక ధృవ పత్రాన్ని అందజేశారు. కన్వీనర్లు ఇన్‌చార్జీగా నాగభూషణరావు ఎన్నిక పట్ల స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళిధర్, మండల పరిషత్ ఉపాధ్యాక్షులు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారామక్రిష్ణ, మండల కో-అప్సన్ మెంబర్ షేక్ రాజు, మండల పార్టీ అద్యక్షుడు నూక సత్యరాజ్, పార్టీ నాయకులు గురువెల్లి కేశవరావు, కాళ్ళ సంజీవ రావు, బలగ సూర్యరావు, నేతింటి అప్పలస్వామి తదితరులు అయనకు అభినందనలు తెలియజేశారు. తన పై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కి, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళికి నాగభూషణరావు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ కోసం మరింత కష్ట పడి వచ్చే ఎన్నికల్లో టెక్కలిలో దువ్వాడ, రాష్ట్రంలో జగన్ గెలుపొందేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం సచివాలయాల ఇంచార్జ్‌గా, నరసాపురం గ్రామానికి చెందిన మోడీ భాస్కర్ రెడ్డిని, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నియమించారు. వైకాపా పార్టీలో సీనియర్ నాయకుడుగా, పార్టీకి అనేక సేవలు అందిస్తున్న భాస్కర్ రెడ్డి, జిల్లా వైకాపా పార్టీ ప్రధాన కార్యదర్శిగా భాద్యులు నిర్వహించారు. ఆయన సేవలను గుర్తించి, ఈ పదవి ఇచ్చినట్లు భాస్కర్ రెడ్డి తెలిపారు. జిల్లా అధ్యక్షుడు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాసు అధ్యక్షతన సమావేశంలో మేరీ టైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, రాష్ట్ర మత్యశాఖ, పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజలక్ష్మి, వైకాపా పార్టీ పెద్దల సమక్షంలో, ఈ భాధ్యతలు అప్పజెప్పారని తెలిపారు. మండల సచివాలయాల ఇంచార్జ్ నన్ను నియమించేందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కి, ప్రత్యేకంగా కృతజ్ఞతాభివందనములు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు. భాస్కర్ రెడ్డి నియామకం పట్ల పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైకాపా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-సోంపేట : మండలంలో రైతుల నుంచి ధాన్యం సేకరణ మరింత వేగవంతం చేయాలని ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం తహశీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ అధ్యక్షతన వ్యవసాయ సలహా సంఘ సమావేశం జరిగింది. మండల వ్యవసాయాధికారి బొర్ర నర్సింహమూర్తి, సిఎస్‌డిటి కూర్మారావు, తదితరులు పాల్గొని రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ జరిగేందుకు చర్చించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలో ప్రతి రైతు భరోసా కేంద్రాన్ని ప్రతి ధాన్యం మిల్లును మరింతగా ఉత్సాహపర్చి రైతులకు సమస్యలు లేకుండా త్వరితగతిన కొనుగోలు పూర్తి చేయించాలని కోరారు. అవసరమైతే మరిన్ని మిల్లులను అనుసంధానం చేయాలని కోరారు. బ్యాంకు గ్యారెంటీల పరిమితిని మరింతగా పెంచాలని సూచించారు. మంగళవారం వరకు 5172 టన్నుల ధాన్యాన్ని 1421 మంది రైతుల నుంచి సోంపేట మండలంలో కొనుగోలు చేసినట్లు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సిఇఓ. నారాయణరావు, అర్బ్ సిఇఓ ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

పదిమందికి ఆదర్శం కావాలి : మండల విద్యాశాఖధికారి దేవేందర్

విశాలాంధ్ర-మెళియాపుట్టి : సేవ చేయడంలో పది మందికి ఆదర్శం కావాలని మండల విద్యాశాఖధికారి ఎస్. దేవేందర్ రావు అన్నారు. మండలంలో గల హీరాపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తను పుట్టిన గ్రామంలో ఎవరు స్థాయికి తగ్గట్టుగా వారు ప్రజలకి ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని సేవ చేయగలగడం పూర్వజన్మ సుకృతమన్నారు. చిన్నప్పుడు ఇదే పాఠశాలలో చదువుకొని ప్రయోజకులైన వారిలో ఆర్మీ జవాన్‌గా పనిచేస్తున్న జి. లోకనాథంతో పాటు ఎల్. శివ, ఎల్.వసంత్, కె.అప్పన్న, కె.మోహన్, జె.లోకేష్‌ల సహకారంతో బుధవారం సరస్వతి దేవి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దేవేందర్ రావుతో పాటుగా పంచాయతీ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పోలయ్య ఈశ్వరరావు, బాబురావు, జీవన్, ఢిల్లీశ్వరరావు, నారాయణ, గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

జీతెలుగులో 'శుభస్య శీఘ్రం' సీరియల్ ప్రారంభం

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జీ తెలుగు ఛానల్ లో నూతన సంవత్సర సంక్రాంతి కానుకగా ఇప్పుడు 'శుభస్య శీఘ్రం' అనే కొత్త సీరియల్ ను ప్రారంభిస్తున్నట్టు ఆ ఛానల్ ప్రతినిధి చెప్పారు. ఒక మధ్య తరగతి తల్లికి అండగా ఉండే కూతురు తన కుటుంబాన్ని ఆపదల నుండి ఎలా కాపాడుకుందనే ఆసక్తికర కథాంశంతో 'శుభస్య శీఘ్రం' రూపొందిందన్నారు. కుటుంబమే ప్రధానంగా భావించే హీరో జీవితంలో కృష్ణ ఎంట్రీతో ఏం జరిగింది? ద్వేషంగా మొదలైన పరిచయంలో ప్రేమ ఎలా చిగురించింది? ఉప్పు, నిప్పులా ఉండేవారిద్దరిని ప్రేమ ఎలా ఒకటి చేసింది? అనేది తెరపై చూడాలన్నారు. ఈనెల 23 నుంచి ప్రసారం అవుతుందన్నారు. బుల్లితెరపై ఎన్నో ఏళ్లుగా ప్రేక్షకులను మెప్పిస్తున్న సాంద్ర జయచంద్రన్ , భావన, ఉమాదేవి ఈ సీరియల్లో ప్రధానపాత్రల్లో నటిస్తున్నారని, 'శుభస్య శీఘ్రం' ప్రారంభంతో 'దేవతలారా దీవించండి' సాయంత్రం 6 గంటలకు, 'రాధమ్మ కూతురు' సాయంత్రం 6:30 గంటలకు ప్రసారం కానున్నాయన్నారు. 'శుభస్య శీఘ్రం' రాత్రి 7 గంటలకు ప్రసారం కానుందని తెలిపారు.

సమిష్టి కృషి వల్లనే వర్సిటీ అభివృద్ధి : వీసీ ప్రొఫెసర్ వెంకటరావు

విశాలాంధ్ర-ఎచ్చర్ల : సమిష్టి కృషితోనే వర్సిటీని అన్ని విధాల అభివృద్ధి సాధ్యమని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ విసిగా పదవి బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం ఆయనను సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండేళ్లలో వర్సిటీకి నాక్ గుర్తింపు, యువతకు ఉపాధినిచ్చే కోర్సులు ప్రారంభించామన్నారు. వర్సిటీలో ఒడియా పీఠం ఏర్పాటు విద్యార్థుల సౌలభ్యం కోసం డిజి లాకర్, వర్సిటీ పాలనా వ్యవహారాల్లో ఈ ఆఫీసు అమలు చేశామన్నారు. ఆన్లైన్ ద్వారా ఫీజు చెల్లింపు విధానాన్ని తీసుకువచ్చామన్నారు. కాంట్రాక్టు బోధన, బోధనేతర సిబ్బంది వేతనాల పెంపుపై సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. వర్సిటీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేలా బోధనా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సిహెచ్ ఎ రాజేంద్రప్రసాద్, వర్సిటీ ప్రిన్సిపాల్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్ ఉదయ భాస్కర్, పాలకమండలి సభ్యులు డాక్టర్ కే స్వప్నవాహిని, డాక్టర్ ఎన్ చిన్నారావు, దానేటి పద్మజ హైకోర్టు న్యాయవాది ఎంవిజీ నాయుడు, సుజాత డాక్టర్ మురపాల అనురాధ, హానరరీ ప్రొఫెసర్ టి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకల ఏర్పాట్లను ఎస్పీ పరిశీలన

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : స్వామివారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా వీఐపీలు వెళ్లే రూట్ మ్యాప్ లను స్పందనంగా పరిశీలించి ఎక్కడెక్కడ బాటికేడ్లు ఏర్పాట్లు పూర్తయ్యాలని ఆరా తీశారు. వృద్ధులకు వికలాంగులకు చిన్న పిల్లలకు దర్శనం కొరకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆలయ అధికారులకు ఆదేశించారు. క్యూలైన్లు, ఆలయ పరిసరాలు, ఇంద్ర పుష్కరిణి క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాల్సిన భద్రత చర్యలపై, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్‌కు సంబంధించిన అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ వెంట డిఎస్పీ ఎం.మహేంద్ర ఆలయ ఈవో సూర్య ప్రకశ్ రావు, సీఐ సన్యాసి నాయడు ఎస్ఐ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర-మెళియాపుట్టి : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. బుధవారం నాడు ఆమె మండలంలో గల వసుంధర గ్రామంలో జరిగిన గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమం అందిస్తుందన్నారు. గ్రామస్తులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధి తదితర వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు జడ్పిటిసి గూడ ఎండయ్య, ఎంపీపీ ప్రతినిధి ఉదయ్ కుమార్, పిఏసిఎస్ అధ్యక్షులు బాలరాజు, మండల కన్వీనర్ పల్లి యోగి, సర్పంచు ఎస్. అప్పలనాయుడు, బమ్మిడి పున్నయ్య, ఎంపీటీసీ సలాన జనార్ధన చిట్టి, జైమినిరావు, రాజశేఖర్ రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి వెలుగు జ్యోతి నందమూరి

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: తెలుగు జాతి వెలుగు జ్యోతి నందమూరి తారక రామారావు అని శ్రీకాకుళం నియోజక వర్గ తెలుగు దేశం పార్టీ యువ నాయకుడు గొండు శంకర్ అన్నారు. తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారకరామారావు 27వ వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలిలో ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు, సూర్య మహల్ జంక్షన్ లో గల ఎన్టీఆర్ విగ్రహానికి శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు గొండు శంకర్ నేతృత్వంలో గార, శ్రీకాకుళం మండలాల ముఖ్య నాయకులు, శ్రీకాకుళం నగర మాజీ కౌన్సిలర్స్, నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఏడు రోడ్ల కూడలి నుండి సూర్య మహల్ జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొండు శంకర్ మాట్లాడుతూ నందమూరి తారక రావు తెలుగు నాట రాజకీయ విప్లవాన్ని సృష్టించారని, ఆయన కాలంలో సృష్టించిన సంక్షేమ పథకాలు దేశంలో వివిధ రాష్ట్రాలలో ఆదర్శంగా తీసుకొని నడిపిస్తున్నారన్నారు. దేశంలో నేషనల్ ఫ్రంట్ స్థాపించి వీ.పీ. సింగ్ నేతృత్వంలో కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని నెలకొల్పిన ధైర్యశాలి అన్నారు. కూడు, గుడ్డ, నీడ పేదవాడికి అందించి పేదల గుండెల్లో చిరస్మరణీయ స్థానం పొందారని అన్నారు. మహిళలకు, రైతులకు వినూత్న కార్యక్రమాలు అందించి ఆడపడుచులకు అన్నగా, రైతులకు రైతు భాందవుడుగా కొనసాగారన్నారు. పేదవాడికి, సామాన్యుడికి రాజకీయం అంటే అర్థం చెప్పిన మహానుభావుడు అన్నారు. ఈ కార్యక్రమంలో పీ.వీ.రమణ, పాండ్రంకి శంకర్, అంబటి లక్ష్మి రాజ్యం, దొండపాటి నవీన్, రెడ్డి శంకర్, నాగేంద్ర యాదవ్, విస్సు, రావుల గాంధీ, పేట పద్మ, కంచు దశరథ, బగ్గు నల మహారాజు, ఎందు చిన్నారావు, పంగ సత్యం, బడగల వెంకటప్పా రావు, కొంక్యన ఆదినారాయణ, పీస రమణ మూర్తి, అరవల పెద్దబాబు, ఎర్రన్న రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో : తెలుగు ప్రజల కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి తెలియజేసిన మహెూన్నత వ్యక్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని ఆయన ప్రజలకు చేసిన సేవలను పలువురు కొనియాడారు. బుధవారం మండల కేంద్రంలో టీడీపీ అధ్యక్షుడు భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మండల దేశం పార్టీ అధ్యక్షుడు భాస్కర్ గౌడ, బస్వ పరమేష్ రెడ్డి, ఉర్లాన వసంత్, పడాల శ్రీను, బసవ భాస్కరరావు, వటికుల చక్రి, శ్రీధర్, సిలార్ తదితర పలువురు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రాజపురంలో... మండలంలోని రాజపురం గ్రామంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గ్రామంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎంపీటీసీ సభ్యులు బత్తిన హేమాచలం పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు పి.సంతోష్, సనపల కామేష్, వాసు, లవరాజు, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సోంపేటలో : ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీని స్థాపించి ప్రజల కష్టాలు, బాధల్లో నేనున్నానంటూ రాష్ట్ర గతిని మార్చి అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు పంచిపెట్టి ప్రజల హృదయాల్లో చిర స్థాయిగా నిలిచి ప్రజల గుండెచప్పుడుగా ప్రఖ్యాతిగాంచిన నందమూరి తారకరామారావు చిరస్మరణీయుడని మండల టీడీపీ అధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు, సోంపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు బీన ఆనంద్ పేర్కొన్నారు. ఎన్టిఆర్ 27వ వర్ధంతిని సోంపేటలో బుధవారం ఘనంగా నిర్వహించి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్రంలో ఎన్ని పార్టీలు వచ్చినా ఎన్నిపార్టీలు మారినా ఎన్టిఆర్ ఎప్పటికీ శాశ్వతమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీన ఈశ్వరరావు, దున్న జోగారావు, దూసి మధు, రెల్ల శ్రీను, మద్దు రవి, జోగిపల్లి దానయ్య, నిట్ట గోపాల్, బైపల్లి బాబూరావు, బెందాళం బాబూరావు, రాఘవదాసు, గోవిందరెడ్డి, పొందూరు తేజ, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో : రక్తదానం చేసి ప్రాణదాత కావాలని టీడీపీ పలాస నియోజకవర్గం కన్వీనరు శిరీషా అన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు 27వ వర్ధంతి సందర్భంగా పలాస టీడీపీ కార్యాలయంలో టీడీపీ, శ్రీకాకుళం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 67 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేష్‌యాదవ్, పీరుకట్ల విఠల్, గురిటి సూర్యనారాయణ, గాలి క్రిష్ణారావు, కుత్తుం లక్ష్మణ్‌కుమార్, దువ్వాడ సంతోష్‌కుమార్, బి.రాజు, వి.యాదగిరి, సవర రాంబాబు, బి.నాగరాజు, జోగ మల్లి, అంబటి కృష్ణమూర్తిలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరులో : దివంగత ముఖ్యమంత్రి ఎన్టి రామారావు 27వ వర్ధంతి సందర్భంగా అక్కుపల్లి ఎన్టిఆర్ జంక్షన్‌వద్ద ఎన్టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి సూరాడ వసంతస్వామి మాట్లాడుతూ ఎన్టిఆర్ ప్రవేశపెట్టి 2 రూపాయలు బియ్యం పథకం పేదల గుండెల్లో నిలిచిపోయిందన్నారు. ఆయన పెట్టే సంక్షేమ పథకాలు కూడా ఇప్పటి వరకు కొనసాగితున్నారన్నారు. కార్యక్రమంలో తెప్పల చాణక్య, పోతనపల్లి సాంబమూర్తి, మరడ దుర్యోదన, అరసవెల్లి ఉమామహేశ్వరరావు, దాసరి జేజేరావు, ఆకుల పాపారావు, బొంపల్లి శివ, తామాడ ప్రదీప్‌లు పాల్గొన్నారు.

మందసలో : మండలం హరిపురంలో దివంగత ముఖ్యమంత్రి ఎన్టిఆర్ 27వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ రాష్ట్రాభివృద్ధి కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు గురించి గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఎన్‌పేటలో : మండలంలోని ఎల్ఎన్‌పేట జంక్షన్ కూడలి నందు బుధవారం స్వర్గీయ ఎన్టీఆర్ 27వ వర్ధంతి వేడుకలు మండల తెలుగుదేశం పార్టీ అధ్య క్షులు వెలమల గోవింద రావు, సీనియర్ టిడిపి నాయకులు కోయిలాపు కృష్ణమాచారి, అంపిలి పోలినాయుడు తధితరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారి ఖ్యాతి,కీర్తిని దేశనలుమూలలా చాటిన మహోన్నత శక్తి,వ్యక్తి దివంగత ఎన్టీ రామారావు అని కొనియాడారు. ముందుగా ఎల్ఎన్‌పేట కూడలి నందు ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురికి బట్టలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ముగడ బద్రయ్య,కుంచాల బాలక్రిష్ణ,మక్క రమణ, పొన్నాన రామక్రిష్ణ, పంగ క్రిష్ణారావు, బొమ్మాలి నవీన్‌కుమార్, ఎంజీఆర్ యువసేన సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో : కీ.శే.నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి పురస్కరించుకొని స్థానిక చిన్నబజారు పార్క్‌లోగల ఎన్టీఆర్ విగ్రహానికి టెక్కలి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి రావు ఆధ్వర్యంలో బుధవారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మెగారక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టెక్కలి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి రావు, హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, మట్టా పురుషోత్తం, మెండ దమయంతి, బెహరా ఖాళీ, రేయ్యి ప్రీతీష్ చంద్ర, ఇప్పిలి జగదీష్, దల్లి ప్రసాద్ రెడ్డి,మల్లిపెద్ది మధు, బసవల అప్పలస్వామి మాస్టారు,

బోరిగి వెంకటరమణ, ధవల రామచంద్ర రావు, మెట్ట చంద్రరావు, మక్కా శంకర్ రెడ్డి, బొడ్డేపల్లి లచ్చు, బాగాది సునీల్, దాసరి వాసు, బొడ్డేపల్లి షణ్ముఖ్ రావు, దారపు రాము, పంగ మన్మదారావు, సంపతిరావు భాస్కరరావు, గండేటి భీమారావు, టెక్కలి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచిలిలో : స్వర్గీయ నేత ఎన్టీఆర్ ఆశయాలను మనమంతా కొనసాగిద్దామంటూ కంచిలి మండల టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మఠం కంచిలి లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదిన రామారావు, బీ కామేష్ రెడ్డి, టీవి రమణ, పిలక చిన్న బాబు, బొడ్డ రాంకుమార్, బంగారు కురయ్య, ఏం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-పలాస : మండలం టెక్కలిపట్నం ఎస్ఎఫ్ఎస్‌లో 2002 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ కలయిక నిర్వహించి ఆనాటి తీపి గుర్తులను, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని గరుడభద్ర సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు అన్నారు. సంక్రాంతి సందర్భంగా గరుడభద్ర సైనింగ్ స్టార్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, క్రికెట్, క్విజ్ పోటీలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు సర్పంచ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వై.ధర్మారాఆవు, చెల్లూరు పాపారావు, నిఖిల్, ధనరాజు, భీమారావులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకోసం గ్రామాలలోకి 104 ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తుందని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోటబొమ్మాళి పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. బుధవారం కోటబొమ్మాళి మేజరు పంచాయతీ అవరణలో ఏర్పాటుచేసిన 104 వైద్య సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 వాహనంలో డాక్టర్‌తో పాటు అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయటం జరుగుతుందని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్. యోగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోయిన క్రిష్ణారావు, ఇర్రి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మా ధాన్యం కొనుగోలుచేసి మాకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-మెళియాపుట్టి : మా రైతుల దగ్గర నిల్వ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి మా రైతులకు న్యాయం చేయాలని జోదూరు గ్రామానికి సంబంధించిన రైతులు యావన్మంది టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి కలిసి విన్నవించుకున్నారు. మెళియాపుట్టి మండలంలో బుధవారం నాడు టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సుడిగాలి పర్యటనలో భాగంగా పాత మారెడుకోట గ్రామంలో ఇటీవల కాలంలో ఎంపీ ల్యాడ్‌తో పూర్తి చేసిన వాటర్ ట్యాంకును పరిశీలించారు. ఈ క్రమంలో దానికి సంబంధిత పూర్తి వివరాలను గ్రామస్తులు, పంచాయతీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో టార్గెట్లు పూర్తయ్యాయని స్థానికంగా ఉన్న అధికారులు తెలియజేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు సబ్ కలెక్టర్‌కి తెలియజేస్తూనే, ప్రభుత్వం సరఫరా చేసిన విత్తనాల్ని కొనుగోలుచేసి పంట పండించామని, తదుపరి ఈక్రాప్ సైతం సంబంధిత అధికారులు చెప్పినట్టుగా చేయడం జరిగిందని, మరి ఇప్పుడు మేము పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు టార్గెట్లు పూర్తయ్యాయని సిబ్బంది తెలియజేస్తుంటే ఇప్పుడు మేము పండించిన ధాన్యాన్ని ఎక్కడ, ఎవరికి అమ్మాలని, అమ్మాలని తదితర రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కార విషయమై తమరు దృష్టికి తీసుకుని వస్తున్నామని మా ఈ రైతుల సమస్యను పరిష్కరించాలని జూదూరు గ్రామానికి సంబంధించిన పలువురు రైతులు గ్రామంలో సబ్ కలెక్టర్ వారు దృష్టికి తీసుకుని వచ్చి విన్నవించారు. కొద్దిమంది రైతులు మాత్రమే యంత్రాల సహాయంతో కోతలు పూర్తి చేసి ధాన్యం అమ్మకాలు చేశారని ఇంకా మిగిలిన అత్యధిక మంది రైతులు నూర్పిడి పద్ధతిలో చేయటం వల్ల ఇప్పటికి ఇంకా కల్లాల్లోనే ధాన్యం మగ్గుతున్నాయని వాపోయారు. దీని పై స్పందించిన సబ్ కలెక్టర్ పై అధికారులతో మాట్లాడి మరో 5 నుంచి 10 శాతం వరకు పెంచుతామన్నారు. అయితే ఐదు, పది శాతం సరిపోదని కేవలం ఒక్క జోదూరు రెవెన్యూ పంచాయతీ పరిధిలోనే సుమారు 200 ఎకరాలు వరకు ఉంటుందని దీంతో కొద్దిమంది రైతులకు మాత్రమే న్యాయం జరుగుతుందని మిగిలిన రైతులు సమస్య మొదటి వస్తుందని రైతులు తెలియజేయడంతో దీని పై స్పందించిన సబ్ కలెక్టర్ తమ పరిధిలో ఏముండదని ప్రభుత్వ ఆదేశాలు మేరకు నడుచుకోవాలని తెలుపగా అందరి రైతులకు సత్వరమే న్యాయం చేయాలని లేని పక్షంలో మీరే దారి చూపించాలని రైతులు కోరడంతో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ సమస్యని జిల్లా కలెక్టర్ దృష్టిలోకి తీసుకొని వెళ్ళి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీనిచ్చారు. దీంతో రైతులు సద్దుమనిగారు.

వైసీపీతోనే గ్రామాలు అభివృద్ధి

విశాలాంధ్ర-మందస : వైసీపీ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలాభివృద్ధి చెందుతున్నాయని ఎంపిపి డొక్కరి దానయ్య అన్నారు. బుధవారం మండలంలో రాంపురం పంచాయతీ బిడిమి గ్రామంలో జిజిఎంపి నిధులు 7 లక్షల రూపాయలతో కాలువ నిర్మాణం, తిమ్మలబిడిమి గ్రామంలో 4.50 లక్షల రూపాలయలతో కాలువ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సవర చంద్రమ్మ, సర్పంచ్ పొట్టి ధర్మారావు, పిఎసిఎస్ అధ్యక్షులు సొర్ర ఢిల్లీరావు, వైస్ ఎంపిపిలు సీర ప్రసాద్, కొర్నాన ఆదినారాయణలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వైకాపా నాయకులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం గోవిందాపురం పంచాయతీ సచివాలయం కన్వీనర్ కంబాల ఈశ్వరరావు మాతృమూర్తి మృతి చెందటంతో, మండలం వైకాపా నాయకులు బుధవారం పరామర్శించారు. సంతబొమ్మాళి మండల వైకాపా నాయకులు సుగ్గు రామిరెడ్డి, గోవిందాపురం సర్పంచ్ రెయ్యి రామిరెడ్డి, నరసాపురం సర్పంచ్ దుక్క భాషన్ రెడ్డి, కొల్లిపాడు సర్పంచ్ గోరుసు సవరయ్య, ఎంపీటీసీ లు, బొంగు కొండయ్య, అనంత హనురావు, శిమ్మ సోమేశ్వరరావు, తోటాడ సర్పంచ్ ప్రతినిది ఎర్నాగుల రామరాజు, కల్లూరు పాపారావు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ ప్రతి ఒక్కరికీ తప్పనిసరి : ఎంపీడీఓ

విశాలాంధ్ర-మెళియాపుట్టి: ఆధార్ అప్‌డేట్స్ ప్రతి ఒక్కరికీ తప్పనిసరని ఎంపిడిఒ చంద్రకుమారి అన్నారు. స్థానిక విలేకరులకు ఆమె ఓ ప్రకటనలో బుధవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది ఏళ్ళ క్రితం ఆధార్ చేసుకున్న ప్రతి ఒక్కరితో పాటు 5 ఏళ్ళు నిండిన పిల్లలు తప్పక ఆధార్‌ను అప్ డేట్ చేసుకోవాలన్నారు. ఈ నెల19వ తేదీ నుండి 24వ తేదీ వరకు ముబైల్ ఆధార్ క్యాంప్ ద్వారా నిర్వహించడం జరుగుతుందని తప్పక ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా స్వాములు దర్శనం

విశాలాంధ్ర-రణస్థలం : స్వర్గీయ ఎన్టీ రామారావు 27వ వర్ధంతి సందర్భంగా ప్రయాణంలో ఉన్న అయ్యప్పస్వాములు పలు దేవాలయాలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండల టీడీపీ నాయకులు ఎం. ఆదినారాయణ ఎన్టీఆర్‌ను స్మరించుకుంటూ తనతో ప్రయాణిస్తున్న స్వాములతో పలు దేవాలయాలు సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈయన వెంట ఇతర స్వాములు ఉన్నారు.

పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలి

విశాలాంధ్ర-ఎచ్చర్ల : ఎస్ఎం పురం పిఏసిఎస్ ద్వారా పంట రుణాలు పొందిన రైతులు ఈనెలాఖరులోగా రెన్యువల్ చేసుకోవాలని పిఏసిఎస్ అధ్యక్షుడు సనపల నారాయణ రావు కోరారు. నిర్దేశించిన గడుగులోగా రుణాలు రెన్యువల్ చేసుకుంటే నాలుగు శాతం మాత్రమే వడ్డీ చెల్లించాలని గడువు దాటితే ఏడు శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాన్ని రుణాలు తీసుకున్న రైతులు గమనించి వడ్డీ రాయితీని పొందాలన్నారు.

కాంగ్రెస్ వైపు మామిడి చూపు

విశాలాంధ్ర-జలుమూరు : ప్రముఖ విద్యావేత్త, సంఘ సేవకుడు జలుమూరు మండలం లింగాలవలస పంచాయతీ హరికృష్ణపేట గ్రామానికి చెందిన మామిడి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ వైపు ఎదురు చూస్తున్నారు. గతంలో యువనేత జగన్‌మోహన్‌రెడ్డి ఆయన తండ్రి దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి అభిమానిగా కాంగ్రెస్‌పార్టీలో కొనసాగి అనంతరం జయప్రకాష్ నారాయణ ఏర్పాటు చేసిన లోక్‌సత్తా పార్టీలో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఆయన సేవలు అందించారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో యువతను లోక్‌సత్తా పార్టీ వైపు మళ్లించారు. నేడు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి ప్రశాంతంగా గడపాలనుకున్న ఎస్ఎస్ఎన్ పాఠశాల యాజమాని మామిడి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ వైపు వెళ్లేందుకు ఆలోచిస్తున్నారు.